క్లుప్తంగా

శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయాభివృద్ధికి విరాళం


ఈవో రామానుజన్‌కు నగదు అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధికి వైఎస్సార్ కడప జిల్లాలోని ప్రొద్దుటూరు పట్టణం, ఆయోధ్య నగర్‌కు చెందిన తొగటవీరక్షత్రియ జ్యోతి ఉత్సవ కమిటీ సంస్థ తరుపున సభ్యులు రూ.1,0,1116 విరాళాన్ని ఆలయ కార్య నిర్వాహణాధికారి రామానుజన్‌కు శనివారం అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులను రామానుజన్ అభినందించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

గడ్డివామి దగ్ధం


మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని ఉమ్మాయిపల్లె తండాలో శనివారం తెల్లవారు జామున వరిగడ్డివాము దగ్ధమైంది. చందు నాయక్ పశువుల మేత కోసం ఆరు ట్రాక్టర్ల గడ్డిని కొనుగోలు చేసి పాఠశాల సమీపాన నిల్వ చేసుకున్నాడు. తెల్లవారు జామున పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో స్థానికులు గుర్తించి ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సమాచారం మేరకు వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. దాదాపు రూ.90 వేల వరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

మహమ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించాలి


ప్రవక్త బోధనలను వివరిస్తున్న మత పెద్దలు

కోవెలకుంట్ల: ముస్లిం సోదరులు మహమ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించాలని కర్నూలుకు చెందిన మత పెద్దలు మౌలానా బసిత్ సాబ్, మౌలానా రహంతుల్లా సూచించారు. స్థానిక ముదిగేడు చౌరస్తా సమీపంలోని షాదీఖాన ఆవరణలో శనివారం ఇస్తేమా నిర్వహించారు. కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాలకు చెందిన సుమారు 2 వేల మంది ముస్లిం సోదరులు ఇస్తేమాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కాబోతోందన్నారు. ప్రతి ఒక్క ముస్లిం రోజు ఐదు పూటలా నమాజ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో నంద్యాల, కోవెలకుంట్లకు చెందిన మత పెద్దలు ఖలీల్, రహి ల్, యాసిన్ మౌలానా, సలామ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దు


నాపరాళ్ల పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడుతున్న సీఐ ప్రియతం రెడ్డి

బేతంచెర్ల: నాపరాళ్ల ట్రాక్టర్, లారీ డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడపవద్దని సీఐ ప్రియతం రెడ్డి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ల్లో నాపరాళ్ల పరిశ్రమల యజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా చూడాలని, నిర్ణీత వేగంతో నడిపేలా మీ పరిశ్రమలలో పనిచేసే డ్రైవర్లకు తెలపాలన్నారు. ముఖ్యంగా అధిక లోడుతో వాహనాలు నడపవద్దన్నారు. డ్రైవరుగా ప్రావీణ్యం ఉంటే చదువుతో సంబంధం లేకుండా లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'అవమానాలకు గురిచేస్తున్న బీసీ'

కొలిమిగుండ్ల: కొద్ది రోజులుగా పార్టీలో తనను అవమానాలకు గురి చేస్తున్నారని, ఈ నేపథ్యంలో త్వరలో తన శ్రేయోభిలాషులు, అనుచరులతో చర్చించి మంచి నిర్ణయం తీసుకుంటానని టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దనరెడ్డి బంధువు పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం కొలిమిగుండ్లలోని ట్రస్ట్ కార్యాలయంలో తల్లి పోతిరెడ్డి లక్షుమ్మతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ బలోపేతానికి తమ కుటుంబం ఎంతో కృషి చేసినా పార్టీ కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే తనను పిలవక పోవడం ఎంతో బాధించిందన్నారు. మూడు నెలల క్రితం నిర్వహించిన ట్రస్ట్ కార్యక్రమ ప్రారంభానికి ఆహ్వానించిన వారిని కూడా వెళ్లొద్దని బీసీ ఆదేశించారని గుర్తు చేశారు. మండలంలో 110 ఎకరాల మైనింగ్ లీజున్న యజమాని అయిన తనను రాయల్టీ సమస్యపై బందార్లపల్లె చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి ఆహ్వానించక పోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

పశు వైద్యం.. సులువాయే!

- మూగజీవాలకు వరంగా మారిన పశువ్యాధి నిర్ధారణ కేంద్రం
- వివిధ రకాల రక్త పరీక్షలు చేస్తున్న తీరు
- పాడి రైతులు, గొర్రెల కాపరులకు తప్పిన ఇబ్బందులు


ప్రయోగశాలలో పరీక్షలు నిర్వహిస్తున్న పశువైద్యులు (ఫైల్)

డోన్: మూగజీవాలకు వరంగా మారింది నియోజకవర్గ కేంద్రం డోన్‌లో నిర్మించిన పశువ్యాధి నిర్ధారణ కేంద్రం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన ఈ కేంద్రం పశువుల ప్రాణాలకు భరోసా కల్పిస్తుంది. పాడి రైతులతోపాటు గొర్రెలు, మేకల పెంపంకదారుల ఇబ్బందులను తొలగిస్తుంది. గతంలో పశువులు, గొర్రెలు, మేకలకు సంక్రమించే వ్యాధులను నిర్ధారించే అవకాశాలు లేకపోవడంతో విలువైన పశుసంపదను కోల్పోయారు మూగజీవాల పోషకులు. కళ్లెదుటే మూగజీవాలు ప్రాణాలు కోల్పోతుంటే వాటిపోషకుల బాధ వర్ణనాతీతం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గతేడాది పశువ్యాధి నిర్ధారణ కేంద్రం నిర్మించింది. మూగజీవాలకు సోకిన వ్యాధులను ఎప్పటికప్పుడు గుర్తిస్తుండడంతో చికిత్సలూ సులువయ్యాయి. డోన్ సబ్‌డివిజన్ పరిధిలో మూడు ప్రాంతీయ పశువైద్యశాలలు, 16 పశువైద్యశాలలు, 14 గ్రామీణ పశువైద్యశాలలు ఉన్నాయి. ఈ వైద్యశాలల్లో పశువులకు సోకిన వ్యాధులను నిర్ధారించేందుకు డోన్‌లో వ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని నాబార్డు నిధులతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పశువులకు సోకిన వ్యాధిని నిర్ధారించేందుకు సకల పరీక్షలు ఇక్కడే నిర్వహిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అవుతుండడంతో సరైన వైద్యం అందించి పశువులను ప్రాణాపాయం నుంచి కాపాడుతున్నారు వైద్యులు. దీంతో పాడిరైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పశు సంపద ఇలా..

డోన్ సబ్‌డివిజన్‌లోని ప్యాపిలిలో 17,344 ఆవులు, 14,640 బర్రెలు, 1,13,337 గొర్రెలు, 42,302 మేకలు, డోన్ మండలంలో 12,534 ఆవులు, 8,374 బర్రెలు, 60,303 గొర్రెలు, 43,175 మేకలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా క్రిష్ణగిరి మండలంలో 13,988 ఆవులు, 8,580 బర్రెలు, 84,718 గొర్రెలు, 34,518 మేకలు, బేతంచెర్ల మండలంలో 7,108 ఆవులు, 12,788 బర్రెలు, 34,227 గొర్రెలు, 26,087 మేకలు, వెల్దుర్తి మండలంలో 10,514 ఆవులు, 5,928 బర్రెలు, 70,392 గొర్రెలు, 20,885 మేకలు కలిపి 1,66,967 జీవాలు ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు నాగరాజు తెలిపారు.


డోన్‌లో నిర్మించిన పశువ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రం

కేంద్రంలో నిర్వహించే పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు

- అంతర్ పరాన్న జీవులను పశువులలో గుర్తించడం
- రక్తపరీక్షలు టిబీసియా, ఫైలేరియా పరీక్షలు
- పాలకు సంబంధించిన పరీక్షలు
- రక్తం, మూత్రంలో ఉదజని శాతాన్ని నిర్ధారించే పరీక్షలు
- చర్మ వ్యాధి నిర్ధారణ
- మూత్రాశయంలో ప్రొటీన్, చక్కెర శాతం గుర్తింపు
- బయోకెమికల్, రక్తంలో చక్కెర శాతం పరీక్షలు
- క్రియాటిన్, కాల్షియం, బిలోరూబిన్, పొటాషియం, యూరియా, ఆల్కాలిస్, పాస్పరస్ శాతం నిర్ధారించే పరీక్షలు

పశువులకు చికిత్సలు సులువు



పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏర్పాటుతో పశువులకు చికిత్సలు సులువు అయ్యాయి. గతంలో చాలా ఇబ్బందులు పడ్డాం. పశు సంపదను ఎంతో కోల్పోయాం. పదుల సంఖ్యలో మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. రైతులతో పాటు పాడి రైతుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తునారు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.
– చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, నేరేడుచెర్ల, ప్యాపిలి మండలం.

ఎంతో ప్రయోజనం



రైతుకు ప్రీతిపాత్రమైన పశువులకు ప్రాణ నష్టం జరగకుండా వ్యాధినిర్ధారణ కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేయడం శుభ పరిణామం. దీనికితోడు సంచార పశువైద్య శాల వాహనాల ద్వారా పశువులకు సకాలంలో సరైన వైద్యం అందించడం గొప్ప విషయం. ఇది రైతాంగానికి ఎంతో ప్రయోజనం చేకూరే అంశం.
– భాస్కర్‌రెడ్డి, రైతు, మల్యాల, డోన్ మండలం.

విస్తృతంగా వైద్య సేవలు



ఏ ఒక్క మూగజీవి అంతుచిక్కని వ్యాధితో మృతి చెందకూడదనేది ప్రభుత్వ ఉద్దేశం. గ్రామీణ పశు వైద్యశాలల్లో పశువులను పరీక్షించి పశువులకు సోకిన వ్యాధులను నిర్ధారించేందుకు రక్త, మల, మూత్రాన్ని ఇక్కడికి పంపుతారు. నా పర్యవేక్షణలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి సకాలంలో పశువులకు విస్తృతంగా వైద్యసేవలు అందిస్తున్నాం.
– నాగరాజు, పశుసంవర్ధక శాఖ సహాయసంచాలకులు, డోన్.

వీడని పైప్ లీకేజీ సమస్య!

- మూడు నెలలుగా ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు
- రెండురోజుల క్రితం మరమ్మతులు చేసినా ఫలితం శూన్యం


పాఠశాల గదిలో ఆర్.ఓ ప్లాంటు వద్ద నీరు లీకేజీ అవుతున్న దృశ్యం

అవుకు: మండల కేంద్రం అవుకు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులను వృథా నీటి పైప్‌లైన్ లీకేజీ సమస్య వీడడం లేదు. దీంతో విద్యార్థినులతోపాటు ఉపాధ్యాయులు ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాల సమీప కాలనీ వాసులకు గతంలో గ్రామ పంచాయతీ తరుపున స్కూల్ ఆవరణను ఆనుకుని శుద్ధజల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వృథా నీరు వెళ్లేందుకు బాలికల ఉన్నత పాఠశాల వెనుక నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మనబడి నాడు–నేడు పథకం కింద బాలికల పాఠశాలలో ఆర్ఓ ప్లాంటును నిర్మించింది. అయితే ఈ ప్లాంట్‌కు సంబంధించి వృథా నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను కాలనీ ప్రజల శుద్ధజల కేంద్రానికి సంబంధించిన పైప్‌లైన్‌కు కలిపారు. వృథానీరు సక్రమంగా వెళ్లకపోవడంతో స్కూల్ పైప్‌లైన్ లీకేజీ అయ్యింది. దీంతో స్కూల్ ఆర్ఓ ప్లాంట్ ప్రాంతం నీటితో నిండిపోతుంది. నీరు తాగడానికి వెళ్లేందుకు విద్యార్థినులతోపాటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు మూడు నెలలుగా పడుతున్న ఇబ్బందులను హెచ్ఎం వివరిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. హెచ్ఎం విన్నపం మేరకు ఎట్టకేలకు స్పందించిన పంచాయతీ సిబ్బంది రెండురోజుల క్రితం దయ చూపారు. అయితే మరమ్మతులు తూతూమంత్రంగా చేపట్టడంతో మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. విషయాన్ని హెచ్ఎం సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా లీకేజీ వాస్తవమేనని, త్వరలో పరిష్కరిస్తామన్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోవెలకుంట్ల: 2023–24 విద్యా సంవత్సరానికి జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కోవెలకుంట్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పిర్దోస్ అంజుమ్ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఐదవ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులు ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 23వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదవ తరగతి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్ విద్యార్థులకు రాత పరీక్ష ఉంటుందన్నారు.

రైతులకు గుర్తింపు ఇవ్వాలి

బనగానపల్లెరూరల్: రైతులకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరుతూ అనంతపురం జిల్లా నుంచి లదాఖ్ వరకు రాజేష్ చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం బనగానపల్లె పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ రైతులు దేశానికి వెన్నముక అన్ని చెప్పుకోవడమే తప్పా తగిన గుర్తింపులేదన్నారు. రైతులకు తగిన గుర్తింపు రావాలనే ఉద్దేశంతో తాను జై జవాన్, జై కిసాన్ నినాదంతో హిమచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని లదాఖ్ (సుమారు 3 వేల కిలోమీటర్లు) వరకు సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు.

ఫ్లెమింగ్ వర్ధంతి

డోన్ టౌన్: పట్టణ పరిధిలోని పాతపూట హైస్కూల్లో శనివారం పెన్సిలిన్ ఇంజక్షన్ ఆవిష్కకర్త సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెన్సిలిన్‌తో మానవాళికి క్షయ, న్యూమోనియా, టైఫాయిడ్ తదితర ప్రాణాంతక వ్యాధుల రక్షణ లభిస్తుందని హెచ్ఎం పద్మావతమ్మ తెలిపారు. ఫ్లెమింగ్ సేవలను సైన్స్ ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి వివరించారు.


నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె మెయిన్ ప్రాథమిక పాఠశాలలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కేపీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైఎస్ఆర్ కడప జిల్లా, ప్రొద్దుటూరుకు చెందిన డాక్టర్ రవి, హిమబిందు రోగులకు కంటి పరీక్షలు చేస్తారని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అలవెన్స్‌లు చెల్లించాలి

డోన్ టౌన్: ఆర్టీసీ కార్మికులకు,ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి బీవీఆర్ రెడ్డి కోరారు. జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడవ రోజు శనివారం ఉదయం ఆర్టీసీ కార్మికులు నల్ల బ్యాడ్జిలు ధరించి డిపో ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ బకాయిలు, డీఏ అలవెన్స్‌లు చెల్లించడంతో పాటు పాత మెడికల్ విధానాన్నే కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు బందెయ్య, చాంద్‌బాషా, కోటేశ్వరరావు, నాగన్న, తిరుపాలు, ఆదిశేషమ్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన మద్దిలేటయ్య ఆలయం


ఆలయ ఆవరణలో భక్త జనం

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్య క్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం శనివారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. ఫాల్గుణ మాసం పురస్కరించుకొని జిల్లా నలుమూలల నుండే కాకుండా తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి సమర్పించి మొక్కులు చెల్లించారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండాదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.12,60,387లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు, రామచంద్రుడు, హనుమంత్ రెడ్డి, క్రిష్టారెడ్డి, వెంగళరెడ్డి, పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, మధుసూదన్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల, కర్నూలు జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు భారీ మెజార్టీ రావాలన్నారు. మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక్క ఓటు సైతం బయటకు పోరాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీకి ఉమ్మడి జిల్లాలో కనీస బలం లేకపోయినా దొంకతిరుగుడుగా అభ్యర్థులను పోటీలో నిలపడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ప్యాపిలి: ఈ నెల 13 వ తేదీన జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో మొత్తం 1436 మంది పట్టభద్రులు, 25 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. పట్టణంలోని స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో రెండు, జలదుర్గంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ తెలిపారు. 13 వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు.

విజయ డెయిరీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


పాడి రైతులకు పాలబోనస్ పంపిణీ చేసిన దృశ్యం

బనగానపల్లెరూరల్: విజయ డెయిరీ సంస్థ పాడిరైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు మిల్ యూనియన్ డిప్యూటీ డైరెక్టర్ ఏవీకే రాజేష్ సూచించారు. శనివారం డెయిరీ బనగానపల్లె యూనిట్ పరిధిలోని గోనవరం సెంటర్‌కు చెందిన 38 మంది పాడిరైతులకు రూ.84,414, జిల్లెల్ల సెంటర్‌లోని 12 మంది పాడిరైతులకు రూ. 19,090 చొప్పున బోనస్ నగదు డిప్యూటీ డైరెక్టర్, బోర్డు డైరెక్టర్ సుబ్బరాయుడితో కలిసి ఆయన పంపిణీ చేశారు. సంస్థకు పాలు పోయి రైతులకు సంస్థ పశువుల కొనుగోలు, పశు గ్రాసం పెంపకం కోసం సబ్సిడీతో పాటు బీమా, బోనస్ కూడా అందజేస్తున్నామని ఈ సందర్భంగా ఏవీకే రాజేష్ గుర్తు చేశారు. కార్యక్రమంలో యూనిట్ మేనేజర్ మధుసూదన్ బాబు, ఏజెంట్ శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాల బోనస్ పంపిణీ

బేతంచెర్ల: మండల పరిధిలోని శంకరాపురం విజయ డైరీ యూనిట్ పరిధిలో ఉన్న మర్రికుంట, బాలాపురం గ్రామాల్లోని పాల కేంద్రాలకు సంబంధించిన పాడి రైతులకు విజయ డైరీ సంస్థ అందజేసే పాలబోనస్ రూ. 29, 580 పంపిణీ చేశారు. విజయ డైరీ శంకరాపురం మేనేజర్ మధుసూదన్ చేతుల మీదుగా శనివారం మర్రికుంట ధోని అయ్యన్న గ్రూపునకు రూ. 15,648, బాలాపురం ఆకుల సుధాకర్ రెడ్డి గ్రూపనకు రూ. 13,932 చొప్పున అందజేశారు.

పశుగ్రాసం దగ్ధం


కాలిపోతున్న జొన్నసొప్ప

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామ సమీపంలో శనివారం రాత్రి పశుగ్రాసం దగ్ధమైంది. అవుకు మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన గడ్డంబాషా నందవరంలో 150 ట్రాక్టర్ల జొన్న సొప్ప కొనుగోలు చేసి గ్రామ సచివాలయ సమీపంలో నిల్వ ఉంచుకున్నారు. అయితే రాత్రి జొన్న సొప్ప వద్ద మంటలు వ్యాపించాయి. గమనించిన గ్రామస్తులు బనగానపల్లె అగ్నిమాపకశాఖ అధికారులకు, నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డికి సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక వాహనం సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే జొన్నసొప్ప పూర్తిగా దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిందా లేక కావాలనే ఎవరైన నిప్పంటించారా అనేది తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు. గడ్డివిలువ సుమారు రూ.15లక్షలు ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు.

ప్రణాళిక బద్ధంగా విద్యార్థులను చదివించండి

అవుకు: పది పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులను ప్రణాళిక బద్ధంగా చదివించాలని ఎంఈఓ శ్రీధర్ రావు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని సంగపట్నం ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ నుంచి అన్ని తరగతుల వారికి పరీక్షలు ప్రారంభమవుతాయని, విద్యార్థులను సంసిద్ధం చేయాలని సూచించారు. ఇకపై ప్రతిరోజు స్టడీ హవర్స్ ఏర్పాటు చేయాలని, వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇసాక్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రవికుమార్, శేఖరుడు, వెంకటేశ్వర్లు, సుజాత, శైలజ పాల్గొన్నారు.

డోన్ టౌన్: విద్యార్థులు పరీక్షల పట్ల భయం వీడితేనే విజయం వరిస్తుందని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు శాంతి, మోటివేటర్ సాయినాథ్ అన్నారు. స్థానిక బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో శనివారం విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. పదవ తరగతి పరీక్షలకు ఏలా చదవాలి, ఏలా రాయాలి, పదికి పది మార్కులు ఏలా సాధించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ లక్ష్మీబాయి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు ఉమా, రాజా సుజాత పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహంలో వార్డెన్ మునిరాజు తల్లిదండ్రుల సమావేశం శనివారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ పేద విద్యార్థులకు ప్రభుత్వం వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలను కల్పించడం జరిగిందని, వాటిని తమ పిల్లలు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. అదేవిధంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆదాంబాషా మాట్లాడుతూ పది పరీక్షలు దగ్గరపడుతున్నాయని, విద్యార్థులు ఒత్తిడికిలోను కాకుండా శ్రద్ధగా చదువుకోవాన్నారు.


విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈఓ శ్రీధర్ రావు..

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల వివరాలు

బనగానపల్లె: బనగానపల్లె నియోజకవర్గంలో ఈ నెల 13న ఓటుహక్కు వినియోగించు కోనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటర్లు 7774, ఉపాధ్యాయ ఓటర్లు 710 మంది ఉన్నారని ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ సువర్ణమ్మ తెలిపారు. పట్టభద్రులు బనగానపల్లె మండలంలో 2949, కోవెలకుంట్ల – 1685, సంజామల – 1022, అవుకు – 1097, కొలిమిగుండ్ల మండలంలో 1021 మంది ఉన్నారన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయ ఓటర్లు బనగానపల్లె మండలంలో 343, కోవెలకుంట్ల – 200, సంజామల – 47, అవుకు – 54, కొలిమిగుండ్ల మండలంలో 66 మంది ఉన్నట్లు వివరించారు. పట్టభద్రుల ఓటర్లకు 9 పోలింగ్ స్టేషన్లు, ఉపాధ్యాయ ఓటర్లకు 5 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కొలిమిగుండ్ల: ఈనెల 15 నుంచి జరుగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్, ఎగ్జామ్ చీఫ్ శ్రీనివాసులు శనివారం తెలిపారు. జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, కస్తూర్బా కాలేజీ విద్యార్థులకు జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశామని చెప్పారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా బనగానపల్లె కళాశాలకు చెందిన రామ య్యను నియమించారన్నారు. ఫస్టియర్ 109 మంది, సెకండియర్ 134 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించమని, విద్యార్థులు ముందుగానే చేరుకోవాలని సూచించారు.

శ్రీరాములమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం.పేండేకల్లు గ్రామంలో వెలసిన పూరాతన శ్రీ రాములమ్మ ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు ముందుకు వచ్చారు. గ్రామస్తులు ఐక్యమై సుమారు రూ.5 లక్షలతో నిర్మించే ఆలయ నిర్మాణానికి సర్పంచ్ ముచ్చు రామక్క, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు గోపాలు రెడ్డి, పరమేష్, కొత్తపల్లె మద్దిలేటి, ఎర్రమల ఆధ్వర్యంలో శనివారం భూమి పూజ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

డోన్ రూరల్ : మండల పరిధిలోని ఉడుములపాడు సమీప పొలాల్లో పేకాట ఆడుతున్న 11మందిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేయగా 13మందిలో ఖాజా, బాలు పారిపోయారన్నారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.78,156 నగదుతోపాటు 65 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

కోవెలకుంట్లలో చోరీ

కోవెలకుంట్ల: పట్టణంలోని రంగరాజుపేటకు చెందిన ఏరాశి వెంకట రమణారెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. శనివారం ఎస్ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. ఓ శుభకార్యం నిమిత్తం ఈనెల 8న వెంకట రమణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లారు. అదేరోజు రాత్రి గుర్తు తెలియని దుండగులు తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. బీరువాలోని 62.5 గ్రాములకు సంబంధించి బంగారు కాసుల దండ, కమ్మలు, నల్లపూసలదండ, పగడాల దండ అపరించుకెళ్లారు. 10వ తేదీన పనిమనిషి ఇంట్లో కసువు కొట్టేందుకువెళ్లగా తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి యజమానికి సమాచారం అందించింది. శనివారం కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. దాదాపు రూ. 2.40 లక్షలు విలువ బంగారం ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన వాచ్‌మెన్ గిడ్డయ్య

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీ వాచ్‌మెన్‌గా పనిచేసే యువకుడు శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గోర్లగుట్ట గ్రామానికి చెందిన గిడ్డయ్య స్థానిక తహసీల్‌పేటలో నివాసం ఉంటూ శేషారెడ్డి సీహెచ్‌సీలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎక్కడ చూపించినా నయం కాకపోవడంతో శనివారం హాస్పటల్ విధులు ముగించుకొని వచ్చి ఉరి వేసుకున్నాడు. గమనించిన భార్య చాందిని కుటుంబ సభ్యులు గిడ్డయ్యను(26) కిందికి దింపి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం మృత దేహాన్ని బనగానపల్లెకు తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్ర శేఖర్ తెలిపారు.